క్లుప్తంగా

విజయదుర్గా అమ్మవారికి అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా అమ్మవారికి పంచామృత అభిషేకాలను నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి తెల్లవారుజామున ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యాశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం కుంకుమార్చన, ఉభయదాతలు, భక్తుల పేరిట పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ చేపట్టారు.

దుర్గగుడిలో స్పెషల్ గ్రీవెన్స్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పనిచేసే సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఆలయ ఈవో శీనానాయక్ బుధవారం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఇకపై దేవస్థానంలో ప్రతినెల రెండో బుధవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు వివరించారు. పదోన్నతులు, సమస్యల పరిష్కారం కోరుతూ ఆలయ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది వినతిపత్రాలు అందజేశారు. దేవస్థానంలో అన్నిస్థాయిల్లో ఉన్న ఉద్యోగులు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయవచ్చునని ఈవో సూచించారు. అదేవిధంగా దేవస్థానంలో పనిచేస్తూ మృతిచెందిన ఓ ఉద్యోగి కుమార్తె అయిన సరిపల్లి అమ్ములుకు బుధవారం ఆలయ ఈవో శీనానాయక్ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పెనమలూరు: పోరంకిలో సీఎం చంద్రబాబునాయుడు గురువారం పర్యటన సందర్భంగా అధికారులు బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్‌మీనా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా ఎస్పీ గంగాధరరావు కల్యాణ మండపంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలపై సీఎం గురువారం సాయంత్రం 5 గంటలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

మల్లెపూల అలంకారంలో కాళీమాత అమ్మవారు



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవస్థానంలో కాళీమాత అమ్మవారిని బుధవారం మల్లెపూలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచంలో దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణకవచంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, ఉభయదాతలు తరలివచ్చారు. మరో వైపున శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద నిర్వహించిన ఖడ్గమాలార్చనకు 33 టికెట్లను విక్రయించారు. రెండు షిఫ్ట్‌లలో అమ్మవారికి ఖడ్గమాలార్చన నిర్వహించారు. చండీహోమంలో 200 మందికి పైగా ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చనలో 16 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. వీటితో పాటు ఆదిదంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో పలువురు భక్తులు, పరోక్ష సేవగా ఆయా సేవల్లో పాల్గొన్నారు.

కుళాయి నీరు ఇలా.. తాగేదెలా?

- కేదారేశ్వరపేటలో కలుషితనీటి సరఫరా..
- దుర్వాసన వస్తున్న తాగునీరు
- అదికూడా అరకొరగానే వస్తున్న వైనం
- కుళాయిల వద్ద మహిళలకు తప్పని నిరీక్షణ
- తీవ్ర ఇబ్బందుల్లో కేదారేశ్వరపేటవాసులు



కేదారేశ్వరపేట వాసులకు కుళాయి ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): జీవనది కృష్ణానది పక్కనే ఉన్నా కేదారేశ్వరపేట ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు మాత్రం తప్పడం లేదు. తాగునీటి కోసం తెల్లవారుజాము నుంచే మహిళలు కుళాయిల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అరకొరగా వచ్చే నీటి కోసం గంటలపాటు కుళాయిల వద్ద మహిళలు నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏ సమయానికి తాగునీరు వస్తుందో తెలియక కుళాయిల వద్ద ఖాళీ బిందెలతో పడిగాపులు కాయాల్సి వస్తోందని కేదారేశ్వరపేట మహిళలు వాపోతున్నారు. గంటల తరబడి వేచిఉన్నా చివరికి రెండుమూడు బిందెల నీటితో సరిపెట్టుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగు మారిన నీరు సరఫరా..

తాగునీటి కోసం కుళాయి ఆన్‌చేస్తే రంగు మారిన నీరు వస్తోంది. కొద్దిసేపు ఆగాక నీరు పట్టుకుందామని వేచి ఉంటే అరగంట తర్వాత కుళాయిల నుంచి నీటిసరఫరా నిలిచిపోతోంది. దీంతో కలుషితమైన నీటినే తాగాల్సి వస్తుండటంతో అనారోగ్యానికి గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ కలుషిత నీటి కారణంగా ఇప్పటికే కేదారేశ్వరపేట ఎర్రమట్టి రోడ్డు, సెంట్రల్ వేర్ హౌస్, ఖుద్దుస్‌నగర్ ప్రాంతంలో అనేకమంది అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

పన్నులు చెల్లిస్తున్నా అందని తాగునీరు..

ఏటా ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లిస్తున్నా తాగేందుకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయడంలో మాత్రం కార్పొరేషన్ అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నుల చెల్లింపు కొంత ఆలస్యం అయితే కుళాయి కనెక్షన్ కట్‌చేసేందుకు వెనుకాడని అధికారులు తాగునీరు సక్రమంగా సరఫరా చేసే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విజయవాడ నడిబొడ్డున ఉన్న తమకే ఇటువంటి పరిస్థితి ఉంటే, ఇక శివారుప్రాంతాల ప్రజలకు గుక్కెడు నీళ్లు కూడా అందుతాయా? అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేసి తమ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కేదారేశ్వరపేటవాసులు కోరుతున్నారు.

దుర్వాసన కారణంగా తాగలేకపోతున్నాం..



ఉదయం తాగునీటి కోసం కుళాయి ఆన్‌చేస్తే రంగు మారిన నీరు వస్తోంది. నలకలు, పురుగులు ఉంటూ నీరు దుర్వాసన వస్తున్నాయి. ఆనీటిని తాగలేక ఇబ్బందిపడుతున్నాం.సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సుజాత, కేదారేశ్వరపేట

అరగంటకు మించి రావడం లేదు..



తెల్లవారుజామునే లేచి తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్నా, అరగంటకు మించి నీరు సరఫరా చేయడం లేదు. తొలుత 15నిమిషాలపాటు వచ్చే నీరంతా మురుగుగా ఉంటోంది. దీంతో తాగునీటితోపాటు ఇంటి అవసరాలకు నీరు సరిపోవడం లేదు.

– లక్ష్మమ్మ, కేదారేశ్వరపేట

వైభవంగా స్వామివారికి గరుడ సేవ



గరుడ వాహనంపై స్వామివారు



కోదండరామాలయంలో స్వామి అమ్మవార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో స్వామి వారికి గరుడ వాహనోత్సవ సేవ అత్యంత వైభవంగా జరిగింది. నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన బ్రాహ్మణవీధిలోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జ్యేష్ఠమాసం పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవను నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి ఆలయంలో స్వామి వారిని గరుడ వాహనంపై అధిష్టింపజేసి ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా బుధవారం పౌర్ణమి రావటంతో స్వామి వారికి గరుడ వాహనోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో, భక్తుల నామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారిని ఊరేగించారు.

శాస్త్రోక్తంగా జ్యేష్ఠాభిషేకం

స్వామి వారికి జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం జ్యేష్ఠాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. జ్యేష్ఠమాసంలో పౌర్ణమి రోజున జ్యేష్ఠాభిషేకాన్ని నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా స్వామి వారి ఉత్సవమూర్తులకు ఉదయం ఆలయంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అలంకారం చేసి విశేష పూజలను ఆలయ అర్చక స్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్‌లు నిర్వహించారు.

కోదండ రామాలయంలో...

పాతబస్తీలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న శ్రీ కోదండరామాలయంలో స్వామి వారికి జ్యేష్ఠాభిషేకాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలమూర్తులకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకారం నిర్వహించి, ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయాచార్యులు జరిపించారు.

కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ వర్కర్స్, స్కూల్ నైట్ వాచ్‌మెన్ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వివిధ తరగతుల కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. సకాలంలో జీతాలు రాకపోవడం వలన కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. జీతాలు పెండింగ్‌లో ఉండటం వలన ఇంటి అద్దెలు కట్టలేక పోతున్నారని, అనారోగ్యం వస్తే వైద్యానికి డబ్బు లేక, పిల్లలకు ఫీజులు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం 11వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న వారి జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే అందరిని కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో స్వామివారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆలయ అర్చకులు, ఆహ్వాన కమిటీ సభ్యులు, స్వామి వారి భక్తులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. దుర్గాఘాట్ నుంచి 108 కలశాలతో పవిత్ర కృష్ణానది జలాలను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఇరుదేవేరులతో ఆశీనులై ఉన్న శ్రీవారికి ఆలయ అర్చకులు విశేష అభిషేకాలను నిర్వహించారు.

శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు

అనంతరం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, టీటీడీ వేద విశ్వ విద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ మురికిపూడి మణిదీపకుమార్ శిష్యబృందం, గణపతి పూజ, ఇతర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం విష్వక్సేన పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తు హోమం, బ్రహ్మోత్సవాల్లో ఐదు రోజులు పాల్గొనే ఉభయదాతలు, భక్తులకు కంకణ ధారణ జరిగాయి. రాత్రికి గరుడ ఆరాధన, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌ను విశేష పుష్పాలతో అలంకరించగా, స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాలను ఆహ్వాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, పొట్నూరి రాజా, మరుపిళ్ల సత్యనారాయణ, కామందుల నరసింహారావు, బంక హనుమంతరావు పర్యవేక్షించారు.

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఫ్లో విజయవాడ చాప్టర్ ప్రారంభం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటైన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ విజయవాడ చాప్టర్‌ను బుధవారం ప్రారంభించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్లో జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ పాల్గొన్నారు. ప్రతిభ గల 15 మంది పేద విద్యార్థినులకు సైకిళ్లను బహూకరించారు. చేనేత వస్త్రాలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో చేనేత ఉత్పత్తులతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పూనమ్ శర్మ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 20 ఫ్లో ఛాప్టర్‌లు ఉన్నాయని, 21వ చాప్టర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. విజయవాడ, వైజాగ్, గుంటూరు నగరాల నుంచి 132 మంది సభ్యులు విజయవాడ చాప్టర్‌లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రష్మీ సరిత, విజయవాడ చాప్టర్ అధ్యక్షురాలు అమ్రిత కుమార్, మెంటార్ పద్మ రాజగోపాల్, గవర్నింగ్ బాడీ సభ్యురాలు ఉషారాణి మన్నే తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్ పనితీరుపై ఏజీఎం సమీక్ష



సమీక్షిస్తున్న ఏజీఎం నీరజ్ అగర్వాల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పనితీరుపై దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్ డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, ఇతర అధికారులతో కలిసి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో డివిజన్‌లో అవలంభిస్తున్న రైళ్ల సమయపాలన, భద్రత, ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై సమీక్షించా రు. ఈ సందర్భంగా ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డివిజన్ పనితీరుపై వివరణాత్మకంగా వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో కంటే భద్రత, సమయపాలన, మౌలిక సదుపాయాల అమలులో డివిజన్ సాధించిన పనితీరును ఏజీఎం సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే పనితీరు కొనసాగించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో డివిజన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రయాణికుల సౌకర్యాలను సంతృప్తికర స్థాయిలో మెరుగుపర్చాలని చెప్పారు. అదే విధంగా రైల్ మదద్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. భద్రత కార్యాచరణపై ఎక్కువ దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా భద్రత నిబంధనలను కఠినంగా పాటిస్తూ అన్ని సెక్షన్లలో క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఏడీఆర్ ఎడ్విన్, పలు బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

14 నుంచి సప్త శనివారార్చన

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో భారతీ తీర్థ మహాస్వామి, విదుశేఖర భారతిస్వామి ఆదేశంతో 14 వ తేదీ శనివారం నుంచి జూలై 26 వ తేదీ వరకు శివరామకృష్ణ సముదాయంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వయంగా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు దేవాలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

• నేటి నుంచి స్కూళ్ల పునఃప్రారంభం



వన్‌టౌన్‌లో పుస్తకాలు కొనుగోలు చేస్తున్న పేరెంట్స్

నగరంలో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల అనంతరం యాజమాన్యాలు స్కూళ్లను శుభ్రం చేయించి, సిద్ధం చేశాయి. విద్యార్థులు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది



వన్‌టౌన్‌లో స్కూల్ బ్యాగ్‌లు సెలక్ట్ చేస్తున్న చిన్నారులు

దుర్గగుడి షాపుల వేలానికి స్పందన నిల్

- 19 షాపుల్లో 11 షాపులకు వేలం నిలుపుదల
- 16 నంబర్ దుకాణానికి నెలకు రూ.2.01 లక్షలు
- వేలంలో రూ.లక్ష పైన పలికిన షాపులు నాలుగు
- ఎనిమిది దుకాణాలకే వేలం నిర్వహణ



టెండర్ బాక్స్‌ను తెరుస్తున్న ఆలయ సిబ్బంది



టెండర్ ప్రక్రియను కొనసాగిస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన మండపం ఐదో అంతస్తులోని దుకాణాలకు ఆలయ అధికారులు బుధవారం వేలం నిర్వహించారు. మొత్తం 19 దుకాణాలకు వేలం నిర్వహించారు. అయితే ఎనిమిది దుకాణాలను దక్కించుకునేందుకు మాత్రమే కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు. 16వ నంబర్ దుకాణానికి రికార్డు స్థాయిలో నెలకు రూ.2.01 లక్షలు చెల్లించేలా జె.శ్రీనివాసరావు దక్కించుకున్నారు. ఈ షాపు కోసం నలుగురు కాంట్రాక్టర్లు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. కలవకొల్లు సాంబయ్య రూ.1.26 లక్షలకు సీల్డ్ టెండర్ దాఖలు చేశారు. రెండో అత్యధిక ధర ఒకటో నంబర్ దుకాణాన్ని కలవకొల్లు అజయ్ నెలకు రూ.1.50 లక్షలకు దక్కించుకున్నారు. కలవకొల్లు లక్ష్మి నెలకు రూ.1.11 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చి 14వ నంబర్ షాపును, 17వ నంబర్ షాపును కె.దుర్గారావు నెలకు రూ.1.13 లక్షలకు దక్కించుకున్నారు. 18వ నంబర్ షాపును రూ.69 వేలకు సోమయ్య, 15వ నెంబర్ షాపును రూ.85 వేలకు పిళ్లా విజయ్‌లోకేష్, రెండో నంబరు షాపును వెంకటదుర్గ నెలకు రూ.71 వేలకు, మూడో నంబర్ షాపును సాయి నెలకు రూ.69 వేలకు దక్కించుకున్నారు. అయితే ఒకటో నంబర్ షాపు పక్కనే ఉన్న రెండు, మూడు దుకాణాలకు తక్కువ ధర పలకడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు షాపుల వేలంలో మొత్తం ముగ్గురు కాంట్రాక్టర్లే పాల్గొనడం గమనార్హం. తిరిగి వేలం నిర్వహిస్తే మరింత ఎక్కువ ధర పలికే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

నిలుపుదల చేసిన షాపులివే...

19 షాపులకు గాను బహిరంగం వేలం నిర్వహించగా కేవలం ఎనిమిది దుకాణాలను మాత్రమే వేలంలో వ్యాపారులు దక్కించుకున్నారు. వీటిలో కూడా కేవలం ఐదు దుకాణాలకే ప్రధాన పోటీ కనిపించింది. బహిరంగ వేలంలో మొత్తం 14 మంది కాంట్రాక్టర్లు పాల్గొనగా, ఒక్కొక్కరు రూ.2 లక్షల ప్రథమ ధరావత్తు చెల్లించారు. మూడు షాపులను మొక్కుబడి ధరకే కేటాయించగా, 4 నుంచి 13వ నంబరు వరకు షాపులకు అసలు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. చివరిలో 19 నంబర్ షాపు వేలం ప్రక్రియను నిలిపివేశారు. టెండర్ ప్రక్రియ దేవస్థాన లీజెస్ విభాగం అధికారులు, 11 మంది కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సాగింది. ఆలయ ఈఓ శీనానాయక్‌కు టెండర్ ప్రక్రియను నివేదిస్తామని, తుది ఉత్తర్వుల కోసం దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపుతామని కమిటీ సభ్యులు తెలిపారు.

కౌన్సిల్ అజెండాపై మేయర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 13న జరిగే కౌన్సిల్ అజెండా పై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో బుధవారం ఆయా శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ అజెండా, అడిషనల్ అజెండా ఉన్న ప్రతిపాదనలను చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ , ఎస్ఈలు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఈఈలు సురేఖ, శ్రీనివాస్‌రెడ్డి, సామ్రాజ్యం, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, జాయింట్ డైరెక్టర్ (అమృత్), ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ లత, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వీఏఎస్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.